# ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తాం

- సింగిరెడ్డి వాసంతి
- మంత్రి నిరంజన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం


జానంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న సింగిరెడ్డి వాసంతి

శ్రీరంగాపురం, అక్టోబర్ 19 : ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆదరిస్తే నియోజవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందని మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి పేర్కొన్నారు. మండలంలోని జానంపేట గ్రామంలో బుధవారం పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గురువారం ఉదయం గ్రామంలో పర్యటిస్తూ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నిరంజన్‌రెడ్డి తరపున కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్తూ అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ వృద్ధులతో సరదాగా మాట్లాడి పింఛన్ వస్తుందా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిది ఏండ్లలో జరిగిన అభివృద్ధి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీని మూడోసారి అధికారంలోకి తీసుకోస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇన్నేండ్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా ఇప్పుడు అధికార దాహంతో ప్రజల ముందుకు వస్తున్న ప్రతిపక్షాలకు ఓటుతోనే సమా ధానం చెప్పాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రీ, సర్పంచులు వెంకటేశ్వర్ రెడ్డి, వినీలారాణి, పార్టీ నాయకులు పృథ్వీరాజ్, పర్వతాలు, కురుమూర్తి, మహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


శ్రీరంగాపురంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఎన్నికల సమస్వయకర్త వంగూరు ప్రమోద్ రెడ్డి


## బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

శ్రీరంగాపురం, అక్టోబర్ 19 : మండలకేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ ఎన్నికల సమస్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మంత్రి నిరంజన్‌రెడ్డిని మరోసారి గెలుపు పీఠంపై కూర్చోబెట్టేందుకు కృషి చేయాలని సూచించారు. మండలంలోని గ్రామస్థాయి పార్టీ శ్రేణులతో ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ మండల నాయకత్వం పర్యవేక్షణ చేయాలని ప్రతి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసేలా గ్రామ పార్టీ నాయకులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, ఎంపీపీ గాయత్రి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి టౌన్, అక్టోబర్ 19 : ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్క్వాడ్ , సర్వైకల్ స్టాటిస్టిక్ టీంలు నిర్వహిస్తు పర్యవేక్షణ, తనిఖీలు పారదర్శకంగా ఎలా జరుగుచున్నవి , వివిధ పత్రికల్లో వస్తున్న ప్రచారాలు సైతం ఒకేచోట నుంచి పర్యవేక్షణ జరిగిన సమస్య ఉత్పన్నమయితే నిమిషాల వ్యవధిలో పరిష్కరించే విధంగా కమాండ్ కంట్రోల్ రూంలో ఏర్పాట్లు ఉండాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూంలో విధులు నిర్వహించే సిబ్బందిని వాళ్లకు కేటాయించిన బాధ్యతలు , విధులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అప్పగించిన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


చిట్యాల వద్ద ఉన్న గోదాం పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

## గోదాంను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

వనపర్తి టౌన్, అక్టోబర్ 19 : పోలింగ్ మెటిరియల్ సరఫరా, సేకరణ కేంద్రంగా వినియోగించుకునేందుకు జిల్లాకేంద్రంలోని చిట్యాల గ్రామ సమీపంలో ఉన్న మార్కెట్ యార్డు గోదాంను గురువారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ రక్షితా మూర్తి పరిశీలించారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల పోలింగ్ మెటిరియల్ సరఫరా, సేకరణ కేంద్రంగా గోదాంను వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నియమావళి నిబంధనల ప్రకారం గోదాంకు ఉండాల్సిన అన్ని వసతులు సిద్ధం చేయాలని, ప్రహరీ, సీసీ టీవి కెమెరాలు వెంటనే పెట్టించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణ, భోజన ఏర్పాట్లు, తాగునీరు, మరుగుదొడ్లు , విద్యుత్ దీపాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వారితో పాటు ఆర్డీవో పద్మావతి, తాసీల్దార్ యాదగిరి తదితరులు ఉన్నారు.



# స్కంద మాతగా జోగుళాంబ..

- అలంపూర్‌లోని శక్తిపీఠంలో వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్, ఎస్పీ
- ఆలయాలకు కొనసాగుతున్న భక్తుల తాకిడి

అలంపూర్, అక్టోబర్ 19 : అలంపూర్‌లోని ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శాస్త్రోక్తంగా, భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నిత్య పూజల్లో భాగంగా అమ్మవారికి గురువారం పూజలు నిర్వహించారు. యాగశాలలో ఆవాహిత దేవతలు, మండపారాధనలకు షోడశోపచార ప్రాతఃకాల పూజలు చేశారు. యాగశాలలో చండీహోమం, మహానివేదన అనంతరం కుంకుమార్చనలు, ప్రదోషకాల పూజలు, నిత్యానుష్టములు, ఆవాహిత దేవతా హోమాలు, బలిహరణ, మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు అమ్మవారు భక్తులకు స్కందమాతగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ఏకాంత ప్రదోషకాల అర్చన గావించి మహా మంగళహారతి సమర్పించారు.

## పట్టు వస్త్రాల సమర్పణ

జోగుళాంబ అమ్మ వారికి ప్రభుత్వం తరపున కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రితిరాజ్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయ పాలకమండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో పూజల అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి చిన్నారులకు ప్రశంశాపత్రాలు అందజేశారు. కుంకుమార్చన మందిరంలో చేనేత కార్మికుడు జోగుళాంబ ఆలయంలో స్వయంగా నేస్తున్న పట్టు చీరను పరిశీలించారు. అర్చకులు అధికారులకు తీర్థప్రసాదాలు అందజేసి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో వారు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, వారి వెంట ఆర్డీవో చంద్రకళ, తాసీల్దార్ మంజుల, ఎస్సై రమేశ్ తదితరులున్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు


మహిళలతో బతుకమ్మ ఆడుతున్న ఆల మంజుల


బతుకమ్మను తీసుకొస్తున్న యువతి

కొత్తకోట,అక్టోబర్19: పట్టణంలోని పాత జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బతుకమ్మలు తీసుకొచ్చారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల హాజరై బతుకమ్మ ఆడారు. తెలంగాణ వచ్చాక బతుకమ్మకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. ఆల మంజులకు మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, ఎంపీపీ గుంతమౌనిక, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, కౌన్సిలర్లు సంధ్య, పద్మ, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు బీమా ప్రసన్నలక్ష్మి ఘన స్వాగతం పలికారు. మహిళ సంఘం సభ్యులు బతుకమ్మ ఆడి ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ చైర్మన్ చెన్న కేశవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, సింగిల్‌విండో చైర్మన్ వాసుదేవారెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, బాలకృష్ణ, బాబురెడ్డి, కొండారెడ్డి, శ్రీనూజీ, మహేశ్వరి పాల్గొన్నారు.